

చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
36.9°/ 12.3°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. చాలా ప్రాంతాల్లో ఉదయం పూట చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



కౌంటింగ్ ఏర్పాట్ల గురించి పరిశీలకులు హరిజవహర్‌లాల్, పోలా భాస్కర్‌కు వివరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టామని ఎన్నికల పరిశీలకులు ఐఏఎస్ అధికారులు హరిజవహర్‌లాల్, పోలా భాస్కర్‌కు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వివరించారు. జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని వారు మంగళవారం పరిశీలించారు. కౌంటింగ్‌కు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలకులకు కలెక్టర్ వివరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు, ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది అభ్యర్థులు ఉన్నందున బ్యాలెట్ పేపర్ సైజ్ పెద్దగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పేపర్లు ఉంచేందుకు సరిపడే పరిమాణం కలిగిన ట్రేలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్రంలో కంచె (ఫెన్సింగ్) పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల లెక్కింపునకు చేపట్టిన ఏర్పాట్లపై పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్, నోడల్ అధికారి నాగేశ్వ రెడ్డి, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి పాల్గొన్నారు.

12, 13, 16 తేదీల్లో సెలవు



అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజక వర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఈనెల 13, ఓట్ల లెక్కింపు 16న జరగనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలింగ్ ముందు రోజు 12న, పోలింగ్ రోజైన 13న, కౌంటింగ్ రోజైన 16న ఆయా సంస్థలకు 'స్థానిక' సెలవు ప్రకటించామన్నారు. ఈ స్థానిక సెలవు దినాల్లో జిల్లాలో ఖజానా, ఉప ఖజానా, ఇతర కార్యాలయాలు, సంస్థలు యథావిధిగా పనిచేస్తాయన్నారు.

సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం



మాట్లాడుతున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత కల్పించనున్నట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన చిత్రదుర్గ, బళ్లారి పోలీసు అధికారులతో ఎస్పీ ఫక్కీరప్ప వర్చువల్ సమావేశం నిర్వహించారు. రహదారులు, మద్యం అక్రమ రవాణా కేసులు, సరిహద్దు గ్రామాల్లోని మద్యం దుకాణాలు, తదితర విషయాలపై చర్చించారు. గత ఎన్నికల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో సరిహద్దు గ్రామాలు, చెక్ పోస్టుల్లో ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.









అనంతపురంలో ఇటుకల ఫ్యాక్టరీలో మహిళా కార్మికులు, జనశక్తినగర్ పెట్రోల్ బంకులో వాహనాలకు పెట్రోల్ నింపుతున్న మహిళ, చెరకు జ్యూస్ తయారీలో నిమగ్నమైన మహిళ, అనంతపురం సమీపంలోని చెరువులో చేపల కోసం వల విసురుతున్న మత్స్యకార మహిళ

సరిలేరు... మీకెవ్వరూ!

- పురుషులతో దీటుగా రాణిస్తున్న మహిళలు



అనంతపురం కల్చరల్: ఆకాశంలో సగం.. అంతులేని సహనం.. అమితమైన నేర్పరితనం .. ఆలిలా.. అమ్మలా.. అత్తమ్మలా.. తోబుట్టువులా.. ఇలా..లాలిస్తూ, పాలిస్తూ, అడుగడుగునా తోడైంది. నీడై నిలిచింది. ఇంటా బయటా.. బాధలు భరించి, దాడులు ఎదురొడ్డి.. అవకాశాలను అందిపుచ్చుకుంటూ.. అన్నింటా 'రాణి'స్తూ.. ఉనికికి మూలమై, మనుగడకు ఆలవాలమైంది. దేవత అయినా.. ధరిత్రి అయినా .. ఎన్ని పేర్లు పెట్టినా.. ఎన్ని పాత్రల్లో ఇమిడినా.. 'ఆమె'కు సాటి రారు.. దీటు రారు..మేటి ఎవరు?.. కష్టాలను ఈదుతూ.. కన్నీటిని రెప్పల మాటున దాస్తూ..సమస్యలపై స్వారీ చేస్తూ స్వ'శక్తి'గా ఎదుగుతోంది. సంఘంలో సగర్వంగా నిలిచింది.. విశ్వమాతగా పేరొందింది.. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళల విజయగాథలు ఇలా...

శ్రావణికి టాలీవుడ్ నుంచి పిలుపు



చౌదరి శ్రావణిని సత్కరిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తికి చెందిన చౌదరి శ్రావణికి టాలీవుడ్‌లో హీరోయిన్ చాన్స్ వచ్చింది. ఈమె అనంతపురంలోని సంస్కార భారతి సంస్థలో కొంతకాలంగా నటనలో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్ నుంచి కబురొచ్చింది. ఏకంగా మూడు సినిమాల్లో హీరోయిన్ అవకాశం దక్కించుకుంది. ఈమె నటిస్తున్న తొలి చిత్రం 'ఆవు.. పులి'. బుధవారం రాజమండ్రిలో షూటింగ్ జరగనుంది. మరొక లేడీ ఓరియంటెడ్ సినిమాలో ఐపీఎస్ పాత్రలో శ్రావణి కనిపించబోతున్నారు. మరొక చిత్రం వివరాలు తెలియాల్సి ఉంది. హీరోయిన్‌గా ఎంపికైన శ్రావణిని మంగళవారం సంస్కార భారతి సంస్థ ప్రతినిధులు సత్కరించారు.

సేవే స్వధర్మం..



కౌసల్య

అనంతపురంలో దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన నైషధం వెంకోబరావు, తిరుపతమ్మ దంపతుల కుమార్తె అయిన దేవరకొండ కౌసల్య కళాకారిణి. వందలాదిమందికి భరతనాట్యం, కోలాటం ఉచితంగా నేర్పిస్తున్నారు. ఎక్కడ సాంస్కృతిక సంబరాలు జరిగినా ఆమె శిష్యుల ప్రదర్శనలు తప్పనిసరి. 'సేవే స్వధర్మమని భావించిన కౌసల్య.. ఆ దిశగా అడుగులు వేశారు. కరోనా విపత్తు సంభవించిన రోజు నుంచి ఇప్పటి వరకు నిరుపేదలకు నిత్యావసర సరుకులందిస్తూ తోడుగా నిలుస్తున్నారు. ఈమె సేవలకు గాను న్యూఢిల్లీ లీగల్ రైట్స్ సంస్థ వారు 'ఉత్తమ మహిళ' అవార్డునివ్వడమే కాకుండా ఆమెను ఏపీ స్టేట్ జాయింట్ సెక్రటరీగా ఎన్నుకుని అనంత మహిళల గౌరవాన్ని హస్తినలో చాటారు.

కూతురి భవిత కోసం...



కుమార్తెతో మహిళా రైతు లలిత

ఉరవకొండ: వజ్రకరూరు మండలం పాతకడమలకుంట గ్రామానికి చెందిన సత్యనారాయణ, లలిత దంపతులు. వీరికి ఒక కుమార్తె సంతానం. తమకున్న ఐదెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ కూతురును చదివిస్తున్నారు. ఐదేళ్ల క్రితం కుమార్తె దీవెన ఎంబీబీఎస్‌లో చేరింది. ఏడాదిలోపే సత్యనారాయణ అనారోగ్యం బారినపడ్డాడు. రూ.20లక్షల దాకా ఖర్చు పెట్టి వైద్యం చేయించినా ప్రాణం కోల్పోయాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కూతురును డాక్టర్ చదువు మాన్పించాల్సి వచ్చింది. ఎంబీబీఎస్‌కు బదులు బయోమెడికల్ ఇంజినీరింగ్ చదివించాలని తల్లి నిశ్చయించుకుంది. తమకున్న ఐదెకరాలకు తోడు మరో ఐదెకరాల పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ.. వచ్చిన సంపాదనతో చదివించుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు లలిత.

అభాగ్యులకు 'పుట్టినిల్లు'



నిర్మలా మురళి

విద్య, సేవను రెండు కళ్లుగా ఎంచుకున్నారు అనంతపురానికి చెందిన నిర్మలా మురళి. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల విద్యార్థుల ఉత్తమ భవిత కోసం కౌన్సెలింగ్ ఇవ్వడం, విద్యాసామగ్రినందించడం చేస్తున్నారు. కరోనా అనంతరం విపత్కర పరిస్థితులను కళ్లారా చూసిన ఆమె ఆస్తిపాస్తులేవీ శాశ్వతం కాదని వేల కుటుంబాలకు మూడేళ్లుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఆదర్శనగర్‌లో 'పుట్టినిల్లు' పేరిట ఆశ్రమం నెలకొల్పి అభాగ్యులకు సేవలందిస్తున్నారు. ఆశ్రమంలో మహిళలు స్వయం ఉపాధి పనులు చేసుకుంటూ ఆత్మవిశ్వాసం, ఆత్మ గౌరవంతో జీవించడానికి దోహదపడుతున్నారు. స్త్రీలు ఒంటరితనాన్ని సేవా మార్గంగా మలచుకోవాలని సూచిస్తున్నారు.

యువత జాగృతమే లక్ష్యంగా...



లక్ష్మీ

దేశ ప్రగతి యువతపైనే ఆధారపడి ఉంటుందని నమ్ముతారు నగరానికి చెందిన గృహిణి లక్ష్మీ. సంస్కార భారతి సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఈమె తరచూ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు సందర్శిస్తూ విద్యార్థుల్లో దేశభక్తిని ప్రబోధించే గీతాలాపనల పోటీలు నిర్వహిస్తున్నారు. సంప్రదాయ సంగీతం, నృత్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. యువతను జాగృతపరచి భారతీయ సంస్కృతిని చాటడానికి కృషి చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ప్రచార వేడి

- ఉమ్మడి జిల్లాలో ఊరూరా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రచారం
- ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి, విప్, ఎమ్మెల్యేలు
- గ్రామాల్లో ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్న ద్వితీయశ్రేణి నాయకత్వం
- తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో కనిపించని హడావుడి
- టీచర్, పట్టభద్రులు రెండింటినీ కైవసం చేసుకునేలా వైఎస్సార్‌సీపీ వ్యూహం



కుందుర్పి మండలం బెస్తరపల్లిలో ప్రచారం చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి నాలుగు రోజులే సమయం ఉండటంతో అభ్యర్థులు ప్రచారం ఉధృతం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం ఊపందుకుంది. మరోవైపు టెలీకాలర్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు హోరెత్తాయి. పోలింగ్ తేదీ దగ్గర పడే కొద్దీ వ్యూహ ప్రతివ్యూహాలతో నాయకులు ముందుకెళుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార వేడి పెరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం ఉధృతం చేశారు. కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఇప్పటికీ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని గ్రామగ్రామానా తిరుగుతున్నారు. మరోవైపు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఓటరు ఒక్కరున్నా సరే ఆ గ్రామానికి వెళ్లి కలుస్తున్నారు.

ఎమ్మెల్యేలందరూ ప్రచారంలోనే

ఉమ్మడి జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేల్లో 12 మంది వైఎస్సార్‌సీపీ వారే. వీరిలో ఒకరు విప్, మరొకరు మంత్రి పదవిలో ఉండగా.. మిగతా పది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు అభ్యర్థుల ప్రచారంలోనే నిమగ్నమై ఉన్నారు. ఉరవకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నా ప్రచారంలో మాత్రం వైఎస్సార్‌సీపీ నాయకులే ముందంజలో ఉన్నారు. ఎమ్మెల్యేలతో పాటు ద్వితీయశ్రేణి నాయకులందరూ గ్రామా ల్లో ఓటర్లను కలిసి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వివరిస్తున్నారు. కొన్ని చోట్ల సాధారణ ఎన్నికలను తలపించేలా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచార తీరు చూస్తోంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం నల్లేరుపై నడకే అని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.

కనిపించని టీడీపీ ప్రచారం

తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిరుత్సాహంలో ఉన్నాయి. నాయకులు ఎక్కడా సమన్వయంతో పని చేయడం లేదని అభ్యర్థులు అసంతృప్తితో ఉన్నారు. ఏ నియోజకవర్గంలోనూ పదిమంది కలిసి ప్రచారం నిర్వహించిన సందర్భం కనిపించడం లేదు. కొన్నిచోట్ల టీడీపీ అభ్యర్థి కంటే పీడీఎఫ్ అభ్యర్థే ముందంజలో ఉన్నట్టు టీడీపీ నాయకులే చెబుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని కొంతమంది టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల వివరాలు ఇలా	
అనంతపురం జిల్లాలో	
పట్టభద్రుల ఓటర్లు	68,341
పురుషులు	45,659
మహిళలు	22,672
ట్రాన్స్‌జెండర్స్	10
టీచర్ ఓటర్లు	5,564
పురుషులు	3,459
మహిళలు	2,104
ట్రాన్స్‌జెండర్	1
శ్రీసత్యసాయి జిల్లాలో..	
పట్టభద్రుల ఓటర్లు	43,310
పురుషులు	29,686
మహిళలు	13,620
ట్రాన్స్‌జెండర్	4
టీచర్ ఓటర్లు	3,349
పురుషులు	2,277
మహిళలు	1,071
ట్రాన్స్‌జెండర్	1



పామిడిలో యువత కేరింత

హోలీ సంబరం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ సంబరం అంబరమంటింది. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతపురంలో రాజస్తానీలు, బంజారాలు, అన్ని వర్గాల వారూ రంగులు పులుముకున్నారు. అందరి జీవితాలూ రంగుల వలె వెలుగొందాలని ఆకాంక్షించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురంలో రాజస్తానీ మహిళల హోలీ సంబరాలు

నేత్రపర్వం.. చెన్నకేశవుడి రథోత్సవం



గోవింద నామస్మరణతో రథాన్ని లాగుతున్న భక్తులు



చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తి

యాడికి: శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో కీలకమైన రథోత్సవం మంగళవారం యాడికిలో నేత్రపర్వంగా జరిగింది. చెన్నకేశవస్వామి గోవిందా.. గోవింద అంటూ భక్తుల నామస్మరణతో పురవీధులు ప్రతిధ్వనించాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం తొమ్మిది గంటలకు ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు హరికృష్ణశర్మ ఆధ్వర్యంలో శివలక్ష్మీ చెన్నకేశవుడి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దేవతామూర్తులను పల్లకీలో రథం వద్దకు తీసుకొచ్చి ప్రదక్షిణ చేయించారు. తర్వాత రథంలో కొలువుదీర్చారు. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు మడుగుతేరును కెనరా బ్యాంకు వరకు లాగాను. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పాత పోలీస్‌స్టేషన్, కోమటి బజార్, పెద్దమ్మ తల్లి దేవాలయం మీదుగా రథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాధంశెట్టి బలరామయ్య 50 కిలోల లడ్డూ, తిరునాంపల్లెకు చెందిన విశ్రాంత హెచ్‌ఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి 80 కిలోల లడ్డూను భక్తులకు పంపిణీ చేయించారు. యాడికి దాసరి నాగరత్నమ్మ, రామచంద్రయ్య దంపతుల కుమారుడు శ్రీనివాసబాబు (వాసు) కృష్ణదేవరాయల బలిజ సంఘం సభ్యుల సహకారంతో 3,500 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూరాధ, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, మాజీ సర్పంచు రమేష్ బాబు, ఆలయ ఈఓ దుర్గాప్రసాద్, ధర్మకర్త రామిరెడి పాల్గొన్నారు.

హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రతి గర్భిణికీ హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి ఆదేశించారు. ప్రసవాలు, కుటుంబ నియంత్రణ అంశాలపై వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన తన చాంబర్‌లో సమీక్షించారు. గర్భస్థ సమయంలో మొదటి త్రైమాసికంలో ఇతర రక్తపరీక్షలతో పాటు హెచ్ఐవీ, సిఫిలిస్, హైపటైటిస్ బీ, సీ పరీక్షలూ నిర్వహించాలన్నారు. గర్భిణుల భర్తలకు సైతం ఈ పరీక్షలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. హెచ్ఐవీ బాధితులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు వెనుకంజ వేస్తున్నారని ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ దృష్టికి కమిటీ సభ్యులు తీసుకువచ్చారు. ఈ అంశంపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డాక్టర్ వీరబ్బాయి పేర్కొన్నారు. ప్రైవేటు నర్సింగ్ హోంల్లో హెచ్ఐవీ కేసులు బయటపడితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రాలకు రెఫర్ చేయాలన్నారు. అనంతరం హెచ్ఐవీతో బాధపడుతున్న పలువురికి పౌష్టికాహారాన్ని అందజేశారు. సమావేశంలో వైద్యులు అనుపమ జేమ్స్, సాధీ స్టేట్ ప్రోగ్రాం స్పెషలిస్టు భాను, నోడల్ అధికారి డాక్టర్ సుజాత, వైద్యులు అరుణ, విజయ్‌కుమార్, రవిశ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- వీడియో చిత్రీకరణ తప్పనిసరి
- పోస్టల్ బ్యాలెట్లు సకాలంలో చేర్చండి
- పశ్చిమ రాయలసీమ జిల్లాల అధికారులకు ఎన్నికల ఆర్ఓ నాగలక్ష్మి సూచన



వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా వీడియో చిత్రీకరణ చేపట్టాలని అధికారులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హోదాలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. పోలింగ్ నిర్వహణ అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుంచి జేసీ కేతన్‌గార్గ్, సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్ఓ గాయత్రీదేవితో కలిసి శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి నిర్వహణ, పంపిణీ, అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ఇలా ప్రతి అంశంపైనా అధికారులకు స్పష్టమైన విధివిధానాలను ఎన్నికల కమిషన్ రూపొందించిందన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. నిబంధనల ఉల్లంఘన ఏ స్థాయిలోనూ జరగకుండా అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేవారికి వీలైనంత ముందుగానే పోస్టల్ బ్యాలెట్ పేపర్ అందించాలన్నారు. 800 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రంలో జంబో బ్యాలెట్ పెట్టె వినియోగించాలని సూచించారు. పోలింగ్ రోజున కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ విధుల్లోని అధికారులు, సిబ్బందికి వసతి, భోజన సదుపాయం, కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా పోలింగ్ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ అధికారి కేశవనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

కళ్యాణదుర్గం/బెళుగుప్ప: ప్రణాళికాబద్ధంగా పోలింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కళ్యాణదుర్గం జెడ్పీ ఉన్నత పాఠశాల, బెళుగుప్ప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి వెబ్ కాస్టింగ్ చేసేందుకు హై స్పీడ్ ఇంటర్నెట్ వసతి కల్పించాలన్నారు. పోలింగ్ కోసం ఈ నెల 13న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సెలవు ప్రకటించామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బెళుగుప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గంగవరం చౌకధాన్యపు దుకాణాలకు 25 క్వింటాళ్ల బియ్యం గత ఐదు నెలలుగా తక్కువ రావడంతో వినియోగదారులకు పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారని స్థానికులు తెలపగా.. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, ఎస్ఐ నాగమధు, డీటీలు వెంకటేశులు, శ్రీనాథ్ రెడ్డి, ఎంపీడీఓ బాలాజీ, బెళుగుప్ప ఎన్నికల జోనల్ అధికారి యల్లప్ప, తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఆర్ఐ నగేష్‌బాబు, పీఆర్ జేఈ సుధాకర్, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

10న ఉద్యోగ మేళా

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముత్తూట్ ఫైనాన్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి, 20 నుంచి 30 ఏళ్ల లోపు ఉన్న యువకులు అర్హులు. ఎంపికైన వారికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్‌ల్లో నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నెలవారీ జీతంపై ప్రొబెషనరీ ఆఫీసర్, జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్స్, ఇంటర్న్‌షిప్ ట్రైనీ అసోసియేట్స్, లాబీ ఎగ్జిక్యూటివ్స్‌గా నియమిస్తారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, ఇతరు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 10న అనంతపురం శివారులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జరిగే ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చు.

ఊపందుకున్న రైల్వే ఎన్నికల ప్రచారం

గుంతకల్లు: రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 10న జరిగే పోలింగ్ ప్రక్రియకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్యానల్ అభ్యర్థులు మంగళవారం గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని పలువురు కార్మికులను కలసి ఓటు అభ్యర్థించారు. యూనియన్ తరఫున బ్రాంచ్ సెక్రటరీ జె.మేఘశ్యామ్, సంఘ్ తరఫున సెక్రటరీ మల్లికార్జున ఆయా కార్మిక సంఘాల నేతలతో కలసి డీఆర్ఎం కార్యాలయం, డీజిల్ షెడ్డు, రైల్వే ఆస్పత్రి, ఎలక్ట్రికల్‌ల తదితర విభాగాలను సందర్శించి తమ ప్యానల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

మహిళా సాధికారత జగన్‌తోనే సాధ్యం



కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే మహిళా సాధికారత సాధ్యమైందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. ఆమె మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా ఏపీ సీఎం అన్ని రంగాల్లోనూ మహిళలకు పెద్దపీట వేశారన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారని గుర్తు చేశారు. ప్రతి కుటుంబంలోనూ ఆడపిల్లలను బాగా చదివించాలని మంత్రి సూచించారు.

గ్రంథాలయ ఉద్యమ పితామహుడికి ఘన నివాళి



వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి తదితరులు

అనంతపురం: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి అన్నారు. అయ్యంకి వెంకటరమణయ్య వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయాధికారి సుబ్బరత్నమ్మ, లైబ్రేరియన్లు ఇంతియాజ్, హేమమాలిని, రామాంజనమ్మ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

రాప్తాడురూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్, జనరల్ విద్యార్థులకు మంగళవారంతో ప్రాక్టికల్స్ పరీక్షలు ముగిశాయి. చివరిరోజు ఉదయం 16 కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా 494 మంది విద్యార్థులకు గాను 492 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 12 కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా.. 238 విద్యార్థులు హాజరయ్యారు.



నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్



జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన రమేష్‌గౌడ్ (చిత్రంలో) ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహయ్య

అనంతపురం క్రైం: సామాజిక న్యాయాన్ని దేశంలోని ఏ ప్రభుత్వమూ ఇప్పటి వరకూ పాటించలేదని, ఈ ఘనత వైఎస్సార్‌సీపీ సర్కార్‌కే దక్కుతుందని ఆ పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అత్యున్నత పదవులు కేటాయిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలను కొనియాడారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ పదవి దక్కినందుకు సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం జెడ్పీలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి, జెడ్పీ ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు.. ఇప్పటి వరకూ బడుగులను కేవలం ఓటు బ్యాంక్‌గానే పరిగణిస్తూ వచ్చారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కలగా మారిన రాజ్యాధికారాన్ని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారన్నారు. నాలుగు జిల్లాల్లోని ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, ఎగ్గల శ్రీనివాసులు, సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, నగరధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు అనంత చంద్రారెడ్డి, జోగి రాజేంద్ర, వాసగిరినాగ్, రామ్మోహన్‌గౌడ్, ఆదినారాయణ, భాస్కర్, నిఖిల్‌రెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించండి : జేసీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాని సిబ్బందికి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. 'ఎన్నికల విధులు – బాధ్యతల' అంశంపై పోలీసు అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా జేసీతో పాటు ఎస్పీ ఫక్కీరప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల లోపు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు అభ్యర్థులు నిర్వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్ స్లిప్‌తోపాటు ఎన్నికల సంఘం ఆమోదించిన మరో గుర్తింపు కార్డును తీసుకువచ్చిన వారిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ట్రైనింగ్ నేషనల్ ఆఫీసర్ జె.రవీంద్ర మాట్లాడుతూ... పోలింగు స్టేషను ఆవరణలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యత ఓటు వేయండి : వెన్నపూస



న్యాయవాదులను ఓటు అభ్యర్థిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం క్రైం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని న్యాయవాదులను వెన్నపూస రవీంద్రారెడ్డి అభ్యర్థించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో పలువురు న్యాయవాదులను కలసి ఓటు అభ్యర్థించారు. రాష్ట్రంలో న్యాయవ్యవస్థ బలోపేతానికి సీఎం వైఎస్‌జగన్ తీసుకున్న చర్యలను వివరించారు. లాయర్ల సంక్షేమ నిధికి ఏటా రూ.వంద కోట్ల కేటాయింపు, న్యాయశాఖలో 3,462 పోస్టుల భర్తీ, కోర్టుల అభివృద్ధికి తీసుకున్న చర్యలను గుర్తు చేశారు. సమస్య ఏదైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తక్షణమే సీఎం వైఎస్ జగన్ స్పందిస్తున్నారన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి, నాయకులు జూటూరు సుధాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, నాగన్న, నరేంద్రరెడ్డి, నరసింహులు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరిదీ పాపం?



కంబదూరు: ఇద్దరు కలిసి చేసిన తప్పు.. నవజాత శిశువుకు శిక్ష పడేలా చేసింది. కారణమేదైనా నవమాసాలు మోసి ప్రసవించిన తల్లి.. పురిటి బిడ్డను ముళ్ల పొదల పాలు చేసింది. పొత్తిళ్లలోనే చనిపోయాడా? లేదా, ముళ్ల పొదల్లో పడేసిన తర్వాత మృతి చెందాడా? అనేది తేలాల్సి ఉంది. వివరాలు.. మంగళవారం ఉదయం కంబదూరు మండలం అందేపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ముళ్ల పొదల్లో కుక్కలు అలజడి చేస్తుండగా స్థానికులు అప్రమత్తమై అటుగా వెళ్లి పరిశీలించారు. నవజాత శిశువు (మగ) మృతదేహాన్ని చుట్టుముట్టిన కుక్కలను గమనించి వాటిని అక్కడి నుంచి తరిమేశారు. ఈ సమాచారం అందుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని పరిశీలించి, స్థానికుల సహకారంతో ఆ మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ పాపానికి బాధ్యులు ఎవరనే చర్చ స్థానికుల్లో కొనసాగుతోంది.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం

శింగనమల: మండలంలోని లోలూరు క్రాస్ వద్ద ముళ్ల పొదల్లో డంప్ చేసిన 169 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలించేందుకు రేషన్ బియ్యాన్ని డంప్ చేసిన గార్లదిన్నెకు చెందిన బియ్యం వ్యాపారి శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని శింగనమల స్టాక్ పాయింట్‌కు తరలించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, డీసీటీఓ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల్లో అపశ్రుతి

- రాతిదూలం పడి కార్మికుడి మృతి



మృతి చెందిన గోపీ

నార్పల: ఆలయ నిర్మాణ పనుల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. రాతిదూలం మీదపడి కార్మికుడొకరు దుర్మరణం చెందారు. నార్పల మండలం కేసేపల్లిలో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన గోపీ (40) అనే కూలీ కేసేపల్లిలో చౌడమ్మ ఆలయ నిర్మాణ పనులకు వచ్చాడు. మంగళవారం రాత్రి దూలం నిలబెట్టే క్రమంలో అదుపుతప్పి గోపీ మీదపడింది. తీవ్రంగా గాయపడిన గోపీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేశారు.

హెచ్చెల్సీలో పడి యువకుడి మృతి



మృతుడు మారేష్

ఉరవకొండరూరల్: ప్రమాదవశాత్తు హెచ్చెల్సీలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. విడపనకల్లు మండలం డొనేకల్లుకు చెందిన చాకలి మారేష్ (30) ఐదేళ్ల క్రితం కుటుంబంతో కలసి ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి వలస వచ్చాడు. కుల వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని హెచ్చెల్సీలో దుస్తులు శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటి పడ్డాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక నీట మునిగిపోయాడు. కుటుంబసభ్యులు కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారు నీటిలో దిగి మారేష్‌ను వెలికి తీశారు. అప్పటికే ఊపిరి అందక అతను మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మహిళ దుర్మరణం



బసమ్మ (ఫైల్)

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనారోగ్యంతో బాధపడుతున్న గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన బసమ్మకు ఇటీవల కుటుంబ సభ్యులు బెంగళూరు శస్త్రచికిత్స చేయించి, ఇంటికి పిలుచుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కర్ణాటకలోని బుడేపల్లిలో నివాసముంటున్న ఆడపడచు బసమ్మ (55) మంగళవారం ఉదయం తన బావ కుమారుడు తిమ్మన్నతో కలసి ఆమెను పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై ఎర్రంపల్లికి బయలుదేరింది. గ్రామ సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో వెనుక కూర్చొన్న బసమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బసమ్మ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గరుడ వాహనంపై దేవదేవుడు



గరుడవాహనంపై నారసింహుడు

కదిరి: అశేష భక్త జన గోవింద నామస్మరణలతో కదిరి మార్మోగింది. ఖాద్రీ లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మ గరుడ సేవలో తూర్పు రాజగోపురం వద్ద స్వామి వారిని దర్శించుకుంటే మరింత పుణ్యం వస్తుందని భక్తుల విశ్వాసం. అందువల్లే స్వామి వారు గరుడవాహనంపై ప్రధాన రాజగోపురం వద్దకు రాక మునుపే ఆ ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. నారసింహుడు తూర్పు రాజ గోపురం వద్దకు చేరుకోగానే 'శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా..గోవింద' అని భక్తుల నోట మార్మోగి పోయింది. విద్యుద్దీపాలంకరణ, కదిరి మల్లెలతో శ్రీవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కేరళ వాయిద్యాలు ఆహూతులను అలరించాయి.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం





సచివాలయ ఉద్యోగులు, జెడ్పీ ఉద్యోగులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత, జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రచారం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం ఉదయం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రాజహంస అపార్ట్‌మెంట్ వెనుకవైపు ఉన్న 1,4,57 సచివాలయల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎమ్మెల్సీ ప్రచారం చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అండగా నిలవండి

ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే సీఎం విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు, లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. 18 స్థానాల్లో 15 మంది బీసీలకు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, రజక కార్పొరేషన్ జిల్లా చైర్మన్ మీసాల రంగన్న, బీసీ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, శ్రీదేవి, నగరాధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు జయలలిత, సుజాత, బాలాంజనేయులు, నాయకులు కృష్ణమూర్తి, అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కడదాం

ఆత్మకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు గెలిపించి సంక్షేమానికి పట్టం కడుదామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని సనప, రంగంపేట, బి, యాలేరు, మదిగుబ్బ, మదిగుబ్బ తండా గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలపోతన్న, నరసింహారెడ్డి, పార్వతమ్మ, గోపాల్‌రెడ్డి, అతికిరెడ్డి, సర్పంచ్‌లు నరసింహ, గౌతమి,రేణుకమ్మ, పోతులయ్య, ఈశ్వరరెడ్డి, టీబీ టైలర్ వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎన్నికల ప్రచారం

అనంతపురం సిటీ: జెడ్పీ కార్యాలయంతోపాటు పంచాయతీరాజ్, ఆడిట్ శాఖల కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేశారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ బీసీ రమేశ్ గౌడ్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, నాయకులు, కార్యకర్తలు మంగళవారం ప్రచారం విస్తృతంగా చేశారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించాలని జెడ్పీలోని అన్ని విభాగాల్లో ప్రచారం చేశారు. అక్కడి నుంచి ఆడిట్ కార్యాలయాలతో పాటు పంచాయతీరాజ్ సబ్ డివిజనల్ కార్యాలయాలు, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలోనూ ప్రచారం చేశారు. అధికార పార్టీ అనుబంధ విభాగాలతో పాటు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: నగరంలోని 43వ డివిజన్‌లోని 5వ రోడ్డులో మేయర్ వసీం మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇస్హాక్, బాబాఫకృద్దీన్, నాయకులు కిశోర్‌బాబు, నస్రీన్, పద్మావతి, రమణ, వాసు పాల్గొన్నారు.

నగరంలోని 5వ డివిజన్‌లో వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున మంగళవారం ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించినా కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జయలలిత, పవన్‌కుమార్ రెడ్డి, రాజాకుళ్లాయప్ప, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

- కమిషనర్ భాగ్యలక్ష్మి హెచ్చరిక



మాట్లాడుతున్న కమిషనర్ కే భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: టౌన్ ప్లానింగ్ మార్గదర్శకాలను ప్రతి నిర్మాణదారుడు పాటించేలా బాధ్యతగా పని చేయాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి పట్టణ ప్రణాళిక కార్యదర్శులను హెచ్చరించారు. మంగళవారం నగర పాలక సంస్థలో కమిషనర్ పట్టణ ప్రణాళిక కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఖాళీజాగా పన్ను జాప్యం, అతిక్రమణలు, రీ సర్వేలో సిబ్బంది నిర్లక్ష్యంపై కమిషనర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 74 సచివాలయాల పరిధిలో 632 ఖాళీ జాగా పన్నుల పెండింగ్‌లో ఉండడంపై సంబంధిత కార్యదర్శిపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. రీసర్వేను కొందరు నిర్లక్ష్యంగా చేస్తున్నారని, ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా, వారిలో మార్పు రాలేదన్నారు. రీ సర్వేకు పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఇన్‌చార్జ్ టీపీఓ మహబూబ్ జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రెండు టన్నుల ప్లాస్టిక్ సీజ్

అనంతపురం క్రైం: నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ కృష్ణారెడ్డిలు నగరంలోని పాతూరు, శ్రీకంఠం సర్కిల్ మార్కెట్, బ్రహ్మణ వీధి, తదితర ప్రాంతాల్లో హోటళ్లు, ఫ్యాన్సీ స్టోర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్రహ్మణ వీధిలోని నరసింహ ఫ్యాన్సీ స్టోర్‌లో అధికారుల తనిఖీలో టన్ను ప్లాస్టిక్ దొరికింది. పాతూరు మార్కెట్, తదితర హోటళ్లలోనూ పెద్ద ఎత్తున ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యదర్శి సంగం శ్రీనివాసులు ప్లాస్టిక్‌ను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అప్పగించారు.

శుభ్రత పాటించాలి: హోటల్ నిర్వాహకులు తప్పక శుభ్రత పాటించాలని కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. మమత, హిమబిందు, హర్ష, విజయ, ముకాంబిక, రవితేజ, మమత హోటళ్లపై దాడులు చేశారు. నిబంధనలు పాటించని హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బకాయి చెల్లించకుండా మొండికేస్తే చర్యలు

అనంతపురం క్రైం: ఇంటి, నీటి పన్ను చెల్లించకుండా మొండికేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అదనపు కమిషనర్ రమణారెడ్డి మొండిబకాయిదారులను హెచ్చరించారు. మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వసూళ్లను ఆయన పరిశీలించారు. ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకపోవడం సరికాదన్నారు. రెవెన్యూ, సచివాలయ అధికారులు ఉదయం 8 గంటల నుంచి పన్ను వసూళ్లు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన 56,57,61, 62, 65 సచివాలయాల్లో క్లాప్ ఆటోల ద్వారా జరుగుతున్న చెత్త సేకరణను పరిశీలించి, చెత్త నిర్వహణ పక్కాగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు వేణు, మురళీ, బాబు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా షబే బరాత్ ప్రార్థనలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలో షబే బరాత్ వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నగరంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షాబాన్ నెలలో వచ్చే పవిత్ర రాత్రిగా దీన్ని ముస్లింలు ప్రత్యేక పండుగగా నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. ఈ సందర్భంగా నగరంలోని శ్మశాన వాటికల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దలను స్మరిస్తూ వారికి ప్రత్యేక నివాళులర్పించారు. ఆయా శ్మశాన వాటికల్లో నగర పాలక సంస్థ నేతృత్వంలో పెద్ద ఎత్తున లైటింగ్, నీటి వసతులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం , జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు ముగ్గురు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. ఇంటిలిపాట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీలో జి. చిరంజీవికి రూ.7.25 లక్షల వార్షిక వేతనం, టీసీఎస్ కంపెనీలో టి. రాజేష్‌కు రూ.6 లక్షల వార్షిక వేతనం, మేధా సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టి. యశ్వంత్‌కు రూ. 4.48 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు దక్కించుకున్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను అభినందించారు.

'జనఆరోగ్య యోజన' అమలు



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

రాప్తాడు: నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎం–జేఏవై)ను అమలు చేస్తోందని డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు పేర్కొన్నారు. గాండ్లపర్తి, జి.కొత్తపల్లి గ్రామాల్లో 104 ద్వారా ప్రజలకు వైద్య సేవలను అందించారు. డీపీఎంఓ మాట్లాడుతూ దీర్ఘకాలిక, సమస్యతమైన రోగాలకు మందులు కొనలేక ప్రాణాలు పోగొట్టుకుంటున్న పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జన ఆరోగ్య యోజన పథకం అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం కింద ఏటా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందిస్తుందన్నారు. అనంతరం 104 ద్వారా రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, 104 డాక్టర్ శివశంకర్, నోడల్ ఆఫీసర్ సూజాత, జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి, సీహెచ్‌ఓ అర్చన పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్



మాట్లాడుతున్న బాలాజీ విద్యా సంస్థల అధినేత పల్లె రఘునాథ్‌రెడ్డి

అనంతపురం రూరల్: విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వం అలవర్చుకుంటేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని బాలాజీ విద్యా సంస్థల అధినేత పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీఫార్మసీ కళాశాలలో స్వాగతోత్సవం నిర్వహించారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో మెలగాలన్నారు.చదువులో పోటీ తత్వం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, ప్రొఫెసర్ గీతావాణి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్

ఆత్మకూరు: ఆత్మకూరు–1 ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుందని ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీ నేతలు పలు అభ్యంతరాలను ఎంపీడీఓకు తెలిపారు. రెండోవార్డుకు సంబంధించి పి.కొత్తపల్లి గ్రామంలో కొన్ని, ఆత్మకూరులో కొన్ని ఓట్లు ఉన్నాయని, ఆత్మకూరు నుంచి పి.కొత్తపల్లికి వెళ్లి ఓటు వేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆయా గ్రామాల్లోనే ఓటు వేసే విధంగా అవకాశం కల్పించాలని ఎంపీడీఓకు తెలియజేశారు. ఆత్మకూరు ఎంపీటీసీ –1 స్థానానికి సంబంధించి మొత్తం 3,612 ఓట్లు ఉన్నాయన్నారు. ఆత్మకూరు ఎంపీటీసీ–1 కు సంబంధించి నాలుగు పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. అనంతరం రాజకీయ నాయకులు అభ్యంతరాలను ఎంపీడీఓకు తెలియచేశారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయండి

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని డిపో మేనేజర్లకు జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని సూచించారు. రీజియన్ పరిధిలోని అన్ని డిపో మేనేజర్లతో మంగళవారం ఆయన తన చాంబర్‌లో సమావేశమై మాట్లాడారు. సర్వీసులను రీ షెడ్యూల్ చేయాలని సూచించారు. కార్గో రవాణా, ఆదాయంపై సమీక్షించారు. కేఎంపీఎల్ పెంచాలని, బ్రేక్‌డౌన్ తగ్గించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్ ఆర్ ఆదోని

వైభవంగా మలోబిలేశుడి రథోత్సవం





రథం లాగుతున్న భక్తులు, రథోత్సవంలో స్వామివారు, లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలోబిల లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. కొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథోత్సవం నిర్వహించారు. లక్ష్మీనరసింహ నమో నమః అంటూ భక్తులు పెద్ద ఎత్తున రథోత్సవంలో పాల్గొన్నారు.

సర్వజనాస్పత్రి ఏఓకు పదోన్నతి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జ్ఞాన సుందరం పదోన్నతి పొందారు. ఆయన్ను అడిషనల్ డైరెక్టర్‌గా నియమిస్తూ నంద్యాల జిల్లా కేంద్రాలోని ప్రభుత్వాస్పత్రికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

దేశం చూపు ఆంధ్రప్రదేశ్ వైపు

- ఎస్ఆర్ఐటీలో ఘనంగా మోడల్ జీ–20 యువ సమ్మేళనం



బహుమతులు అందజేస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ హరిబాబు

అనంతపురం: విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సదస్సు విజయవంతమై, రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు రావడంతో దేశం ఏపీ వైపు చూస్తోందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఈ.హరిబాబు అన్నారు. మంగళవారం ఎస్ఆర్ఐటీ కళాశాలలో మోడల్ జీ–20 యువ సమ్మేళనం నిర్వహించారు. వీసీ హరిబాబు మాట్లాడుతూ మోడల్ జీ–20 యువ సమ్మేళనం నిర్వహణతో విద్యార్థుల్లో ఔత్సాహిక పారిశ్రామిక విధానం, విదేశీ సంబంధాలు, పరస్పర ఆలోచనా మార్పిడి, నూతన ఆవిష్కరణలపై అవగాహన, గ్లోబల్ మార్కెట్‌పై పట్టు తదితర అంశాలు విద్యార్థుల్లో అవగాహన ఏర్పడడానికి చక్కటి వేదికవుతుందన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన తరహాలోనే విద్యార్థులు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడడం ప్రశంసనీయమన్నారు. జీ–20 దేశాల్లో ఉన్న వనరులను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై విద్యార్థులు ప్రసంగించిన తీరు అద్భుతంగా ఉందన్నారు.

అంతర్జాతీయ సదస్సులా నిర్వహించడం గర్వకారణం:

మహిళా సాధికారిత, స్థిరమైన లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన కలిగే రీతిలో అంతర్జాతీయ వేదిక తరహాలోనే ఇలాంటి సదస్సులు నిర్వహించడం గర్వకారణమని వీసీ అన్నారు. మార్కెట్‌కు దీటుగా నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇంజినీరింగ్ విద్యార్థులకు దోహదపడిందన్నారు. జీ–20 దేశాలైన అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, యూకే, టర్కీ, యూరప్, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, యూఎస్ఏ, జపాన్, రష్యా, సౌదీ అరేబియా, సౌత్ ఆఫ్రికా, సౌత్ కొరియా, టర్కీ, మెక్సికో దేశాల తరహాలోనే వివిధ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రసంగించారు. కర్ణాటక, తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్, మోడల్ జీ–20 సమ్మిట్ అధ్యక్షుడు స్టీఫెన్ అనురాగ్, సీనియర్ జర్నలిస్ట్ కోరిన్ సారెస్ తదితర ప్రముఖులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. టోస్ట్‌మాస్టర్, వహీద పర్వీన్, ఎల్‌టీ సుమిత, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు మంజీర తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ డెలిగేట్స్‌గా లిటిటియా డీకోశా, శ్రీ నిత్య, వినయ్, బాలెంచ్, పల్లవి, రామాంజనేయులుకు దక్కింది. కార్యక్రమంలో ఎస్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



మోడల్ జీ–20 సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించడమే 'సంస్కార భారతి' లక్ష్యమని ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్, సంస్కార భారతి గౌరవాధ్యక్షుడు సుధాకర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో సంస్కార భారతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా లక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 30 మంది మహిళలకు ఈ సందర్భంగా 'మహిళా సేవా పురస్కార్' అవార్డులు అందజేశారు.

అనంతపురం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ జెడ్పీటీసీ విశాలక్షి పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులోని సంసిధ్ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య' స్కూల్‌లో మహిళా దినోత్సవం

రాప్తాడురూరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీ చైతన్య బాలికల పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఏజీఎం సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలకు ఆటలపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి సుబ్బారెడ్డి చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనా ఖాన్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నారాయణ కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న యాజమాన్యం, విద్యార్థులు

రాప్తాడురూరల్: సాయినగర్‌లోని నారాయణ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. స్థానిక ఆపిల్ ఫంక్షన్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలికలు చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. బాలురు మాస్ డ్యాన్సుతో అదరగొట్టారు. నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకటరామిరెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థీ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యమం

అనంతపురం అర్బన్: డిమాండ్ల సాధనకు తప్పని పరిస్థితుల్లో ఉద్యమానికి సిద్ధపడినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు తెలిపారు. మంగళవారం మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను జేఏసీ జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, తదితరులు కలిసి ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్ ప్రతిని అందించారు. జేఏసీ రాష్ట్ర కమిటీ ప్రకటించిన విధంగా ఈనెల 9 నుంచి దశలవారీ ఉద్యమానికి వెళ్తున్నామన్నారు. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం ఉద్యమం ఏప్రిల్ 3 వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా కార్యాచరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి మారుతీప్రసాద్‌రెడ్డి, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు సోమశేఖర్, సచివాలయం నాయకుడు కేధార్ పాల్గొన్నారు.



ఇస్కాన్ మందిరంలో వసంతోత్సవం



హోలీ జరుపుకుంటున్న చిన్నారులు



నగర వీధుల్లో రాజస్థానీల హోలీ సంబరాలు

హోలీ..జాలీగా



కమలానగర్‌లో హోలీ సందర్భంగా నృత్యాలు చేస్తున్న మర్వాడీలు

అనంతపురం కల్చరల్: నగరవాసులు పాల్గున పౌర్ణమి రోజును ఆనందోత్సాహాల మధ్య 'హోలీ'గా జాలీగా జరుపుకున్నారు. నగరమంతా వసంతోత్సవంగా మారింది. పాతూరు, వేణుగోపాల్‌నగర్, కమలానగర్ ప్రాంతాల్లో యువతీ యువకులు, చిన్నారులు రంగు నీళ్లు చల్లుకొని ఆనందంగా గడిపారు. అనంతలో స్థిరపడిన రాజస్థానీలు, గుజరాతీలు ఉదయం నుంచే ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా హోలీ ఆడుకున్నారు. పాతూరు, కమలానగర్‌లలో కొలువైన జైన్ మందిరాలలో హోలీ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. రాజస్థానీ సంప్రదాయాలకనుగుణంగా పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించి, ఇంటిల్లిపాది వేడుకలు జరుపుకున్నారు. బుధవారం హోలీ సంబరాలు చేస్తామని పాతూరులో స్థిరపడిన ఉత్తరాది వారు తెలిపారు. బంజారాలు హోలీ సంబరాలను జరుపుకున్నారు. నగర శివారులోని ఇస్కాన్ మందిరంలో హోలీ సందర్భంగా దామోదర గౌరంగదాసు నేతృత్వంలో గౌరీవ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాధా పార్థసారథులకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.



హోలీ జరుపుకుంటున్న మహిళలు

రాప్తాడు: మండల కేంద్రంతోపాటు మండలంలోని గ్రామాల్లో హోలీ సంబరాలు (రంగుల పండుగ) మంగళవారం అంబరాన్నంటాయి. రాప్తాడులో ప్రతి విధిలోనూ రంగులు చల్లు కుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. మహిళలు, ఇంజనీరింగ్ విద్యార్థినులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. హోలీ సందర్భంగా గ్రామాలు రంగుల మయమయ్యాయి. యువకులు మోటార్ బైక్‌లపై సందడి చేశారు.